
## తుంగతుర్తి నియోజవర్గ
# ఇంచార్జిగా సూరారపు కృష్ణవేణి



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రక్షణ సేన తుంగతుర్తి నియోజకవర్గం ఇంచార్జిగా సూరారపు కృష్ణవేణి నియమితులయ్యారు. ఈ మేరకు టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తొలి జాబితాలో 23 మందిలో కృష్ణవేణికి అవకాశం కల్పించారు. తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న కృష్ణవేణికి తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జిగా ప్రకటించడం పట్ల పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. భవిష్యత్‌లో ఎమ్మెల్యే ..మిగతా 2లో



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
గురువారం | 16 | జూలై | 2026 | పేజీలు: 08



# పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ( ఏడబ్ల్యూఎస్ ) డేటా సెంటర్ శంకుస్థాపన**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**






**రంగారెడ్డి, అక్షిత బ్యూరో:** తెలంగాణను ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ( ఏడబ్ల్యూ ఎస్ ) డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రపంచ స్థాయి, కాలుష్యరహిత, అత్యాధునిక నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 100కు పైగా దేశాల ప్రతినిధులు, వేలాది కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని, ఫార్చ్యూన్--500 సంస్థల పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రస్తుతం దేశ జనాభాలో తెలంగాణ వాటా సుమారు 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో రాష్ట్రం వాటా 5 శాతం ఉందని, దానిని 2047 నాటికి 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ లక్ష్య సాధనకు ..మిగతా 2లో

## సర్ ప్రక్రియను
# వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్గొండ టౌన్ , అక్షిత న్యూస్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం ..మిగతా 2లో

## రూ.840 కోట్లతో
# సుందరంగా కరీంనగర్

**3 నెలల్లో యూసీఎఫ్ పనులు షురూ**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, అక్షిత బ్యూరో :** రాబోయే 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ "యూసీఎఫ్" స్కీం కింద కేంద్రం మంజూరు చేసిన రూ. 840 కోట్ల నిధులతో కరీంనగర్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రారంభిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆయా నిధులతో కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మించడంతోపాటు స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ..మిగతా 2లో



## రూ.117 కోట్లతో ధర్మపురి
# కోటిలింగాల ప్రగతి

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు**

**భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ**

**అదనపు అభివృద్ధి పనులకు మరో రూ.50-60 కోట్ల ప్రతిపాదనలు**

2



## తుంగతుర్తి నియోజవర్గ ఇంచార్జిగా సూరారపు కృష్ణవేణి

**మొదటి పేజీ తరువాయి...**

అభ్యర్థిగా సూరారపు కృష్ణవేణి పోటీచేసే అవకాశం ఉందని అధినేత్రి నిర్ణయం సంతోషకరమని టీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

**కవితమ్మకు కృతజ్ఞతలు: కృష్ణవేణి**

తనపై విశ్వాసం ఉంచి తుంగతుర్తి నియోజక వర్గం ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించిన టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మకు ఈ సందర్భంగా కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.117 కోట్లతో ధర్మపురి కోటిలింగాల ప్రగతి

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**జగిత్యాల, అక్షిత బ్యూరో :** జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రంలో 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జూన్-2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం లో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, గ్రంథాలయం చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల ఆర్.డి.ఓ. మధుసూదన్, దేవాలయం ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు, పంచాయతీ రాజ్ ఏఈ లు, రోడ్డు భవనాల శాఖ ఏఈ లు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

నాగార్జునసాగర్‌లోని 7, 10, 12 వార్డుల్లో బీఎల్‌ఓలు చేపడుతున్న సర్ ప్రక్రియ, ఓటర్ల మ్యాపింగ్ విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న నమోదును పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక బి ఎల్ ఓ తో మాట్లాడుతూ "మీ వార్డులో మొత్తం ఎన్ని ఓటర్లు ఉన్నారు? ఎన్ని ఫారాలు జనరేట్ అయ్యాయి? ఎన్ని మ్యాపింగ్ చేశారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?" అని ప్రశ్నించారు. దీనికి బీఎల్‌ఓ సమాధానంగా మొత్తం 961 ఓటర్లు ఉండగా, 593 మంది మ్యాపింగ్ పూర్తి చేశామని, మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న ప్రతి ఓటరును గుర్తించి ఎలాంటి ఆలస్యం లేకుండా సర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. డోర్ లాక్ కారణంగా ఇంట్లో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సంబంధించిన డోర్ నంబర్ నమోదు చేస్తూ ఓటర్ల మ్యాపింగ్ చేయాలని చెప్పారు.

అన్‌మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వారి (ఓటరు గుర్తింపు కార్డు) నంబర్ ఉంటే నమోదు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒక్క ఓటు మాత్రమే ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మ్యాపింగ్ పూర్తయిన తర్వాత నమోదు వివరాలను సక్రమంగా రికార్డు చేయాలని తెలిపారు. ఎవరైనా ఓటరు తమ ఎపిక్ నంబర్ చెబితే వెంటనే ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటరు వివరాలు నిర్ధారించవచ్చని కలెక్టర్ వివరించారు.

10వార్డులో ఒక ఓటరు తన ఎపిక్ కార్డు తీసుకొచ్చి కలెక్టర్ కు ఇవ్వగా కలెక్టర్ వెంటనే ఎపిక్ ద్వారా ఆన్లైన్లో చెక్ చేసి తన ఓటు ఉందని చెప్పారు.

మరణించిన వారి ఓట్లను తొలగించేందుకు మరణ ధృవీకరణ పత్రం ఆధారంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

## పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

భారీ పెట్టుబడులు, అత్యాధునిక మౌలిక వసతులు, విస్తృత ఉపాధి అవకాశాలు అవసరమని పేర్కొంటూ, తెలంగాణ--2047 అభివృద్ధి విధానాన్ని అంతర్జాతీయ నిపుణుల సూచనలతో రూపొందించినట్లు తెలిపారు. సింగిల్ విండో విధానం, పారదర్శక అనుమతుల వ్యవస్థ, వేగవంతమైన భూ కేటాయింపులతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పెట్టుబడిదారుల సమస్యలను ప్రతి నెల స్వయంగా సమీక్షించి తక్షణ పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక, పర్యాటక, ఇంధన, క్రీడలు, ఆరోగ్యం, సంక్షేమ రంగాలకు సమగ్ర విధానాలను రూపొందించామని, నాణ్యమైన విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని, దీనివల్ల ఐటీ, సాఫ్ట్‌వేర్, అనుబంధ పరిశ్రమలు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వచ్చే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్యరహిత, సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ వాహనాలకు ప్రోత్సాహకాలు, పన్ను మినహాయింపులు వంటి చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఢిల్లీ కాలుష్యం, ముంబై వరదలు, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలు వంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నగరాభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ వెలుపల, రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న విస్తార ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి, విద్యుత్, నీరు, భూమి, అనుమతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందుబాటులో ఉంచడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించి లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




రంగారెడ్డి జిల్లా రైతులు ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్ల అభివృద్ధి కోసం భూములు అందించి రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న సహకారాన్ని ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని తెలిపారు. రైతులకు న్యాయమైన, మెరుగైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

చివరగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ యాజమాన్యానికి, ప్రతినిధులకు అభినందనలు తెలియజేస్తూ, అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం అత్యంత వేగంగా మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా కొనసాగాలని సంస్థను కోరారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు, ఉపాధి అవకాశాల కల్పనకు కీలక మైలురాయిగా నిలుస్తుందని




అన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు నియంత్రణ సంస్థగా కాకుండా సహాయకుడిగా (ఫెసిలిటేటర్ ) వ్యవహరిస్తోందని, పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, అనుమతులు, మౌలిక సదుపాయాలు వేగంగా అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేసి, నిరంతర విద్యుత్ సరఫరా, నీటి వసతి, రహదారులు, కనెక్టివిటీతో కూడిన సమగ్ర మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధస్సు విస్తరణతో పెరుగుతున్న డేటా ప్రాసెసింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణను అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక విధానాలు, వేగవంతమైన అనుమతి వ్యవస్థతో రూపొందించామని, పెట్టుబడిదారులు ఆశించిన దానికంటే వేగంగా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ( ఎఫ్ సి డి ఏ ) కమిషనర్ శశాంక, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, కె.చంద్రారెడ్డి, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు విక్రమ్, అనురాగ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.840 కోట్లతో సుందరంగా కరీంనగర్

**మొదటి పేజీ తరువాయి...**

శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం ఉదయం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 47వ డివిజన్ లోని రాంనగర్ సిద్దార్థ స్కూల్ సమీపంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ శ్రీరామ బుక్ స్టాల్ లేన్ నుండి మోర్ సూపర్ మార్కెట్ వరకు రూ.98 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి"యూఐడీఎఫ్" కింద కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ కు మంజూరు చేసిన రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు ఈరోజు మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది. మరో 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ "యూసీఎఫ్" స్కీం కింద కేంద్రం ఇచ్చిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులను కూడా ప్రారంభించబోతున్నాం. ఇచ్చిన మాట ప్రకారం కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించిన 100 రోజుల్లోనే యూడీఎఫ్ నిధులను తీసుకొచ్చిన. మాపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా. మీకు తెలుసు. గతంలో నిధుల్లేక ఇబ్బందులు పడేవాళ్లం కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వలేని దుస్థితి. ఇయాళ గల్లా ఎగరేసుకుని అభివృద్ధి పనులు చేయించే సత్తా కార్పొరేటర్లకు వచ్చింది. ప్రజలు ఆశీర్వదించి మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించడంతో ప్రధాని వద్దకు వెళ్లి కరీంనగర్ కు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని కోరుతున్నాం. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే యూసీఎఫ్ ఫండ్ ఇస్తే ఆ జాబితాలో కరీంనగర్ కూడా చేరింది. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ "మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు" వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ లో పార్కింగ్ సమస్య లేకుండా రూ.25 కోట్లతో శాశ్వత పరిష్కార పనులకు శ్రీకారం చుట్టినం. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో కరీంనగర్ ను అభివృద్ధి చేస్తున్నా. ఇక కరీంనగర్ పార్లమెంట్ విషయానికొస్తే ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్లు తీసుకొచ్చిన. రోడ్ల నిర్మాణం కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నం. దసరా నాటికి కరీంనగర్ వరంగల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. అతి త్వరలో కరీంనగర్ జగిత్యాల హైవే పనులను ప్రారంభిస్తాం. గన్నేరువరం బ్రిడ్జి నిర్మాణ పనులకు సైతం అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. రాబోయే రోజుల్లో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా అభివృద్ధి చేస్తా. కరీంనగర్ పార్లమెంట్ ను అభివృద్ధిలో అగ్రగామిగా, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నా.

# దత్తాయపల్లి గ్రామ అభివృద్ధికి మరిన్ని అడుగులు

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

**ప్రతి పేద కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**గ్రామానికి ఇప్పటికే రూ.7 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** దత్తాయపల్లి గ్రామ అభివృద్ధికి మరిన్ని అడుగులు వేస్తుందని, ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండలం దత్తాయపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శంకుస్థాపనలు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, గ్రామపంచాయతీ భవన నిర్మాణం, గోదాముల నిర్మాణం, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. అనంతరం గ్రామంలోని 8 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై వారికి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరిన ప్రతి కుటుంబంతో ఆప్యాయంగా మమేకమై వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, రేకుల ఇళ్లు, గుడిసెలు, అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తూ ఎండలు, వర్షాలు, గాలివానలు వచ్చిన ప్రతిసారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతికామని, పేర్కొన్నారు. చిన్న చిన్న పిల్లలను పెట్టుకొని వర్షపు నీరు కారే ఇళ్లలో, వేసవిలో భరించలేని వేడిలో, చలికాలంలో తీవ్ర ఇబ్బందులతో జీవనం గడిపిన పరిస్థితులను గుర్తు చేశారు. ఒక సురక్షితమైన గూడు కోసం ఎన్నో సంవత్సరాలు ఎదురుచూసామని కన్నీటి పర్యంత మైయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారి సొంత ఇంటి కలను నిజం చేస్తోందని అన్నారు. పేద కుటుంబాలు గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో, సురక్షితమైన వాతావరణంలో జీవించేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, దత్తాయపల్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే దాదాపు రూ.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రహదారులు, భవనాలు, తాగునీరు, విద్యుత్, ఇతర ప్రజావసరాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేసి దత్తాయపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంత గృహాలను అందించడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులకు కొత్త రేషన్ కార్డుల మంజూరు, సన్న బియ్యం పంపిణీ, మహిళల ఆర్థిక సాధికారత కోసం వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రైతులకు రైతు భరోసా, రైతు సంక్షేమ కార్యక్రమాలు, విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి కుటుంబంలో ఆర్థిక భరోసా, సామాజిక భద్రత, అభివృద్ధి ఫలాలు చేరేలా పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి తీసుకువచ్చి ప్రతి కుటుంబం సంతోషంగా జీవించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ కిషన్ నాయక్, మాజీ ఎంపీపీలు శంకర్ నాయక్, కిచ్చారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు సరికాదు

**వనపర్తి అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట ప్రభుత్వ పాఠశాల ప్రారంభం సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులను బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కే శ్రీనువాసుజి, పి శాంతిరాజ్, వికాస్, బి మహేష్, రాజ్ కుమార్, జె కిరణ్ ను ముదస్తు గా పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అంగమ ఆర్భాటాలతో కొత్తకోటలో 15 కోట్లు తో అభివృద్ధి చేస్తామని మంత్రులు ఎమ్మెల్యే సమక్షంలో శిలాపాలకాలు వేశారు నిధులు లేవు పనులు ప్రారంభించడం లేదని పేర్కొన్నారు. 20 సంవత్సరాలైనా కానయా పల్లి నిర్వాసితులకు పునరావసం కల్పించడం లేదని పట్టా సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. అంగన్వాడి ఆశలకు ఎన్నికల ముందు 18 వేల రూపాయలు వేతనము ఇస్తామని హామీలు ఇవ్వడం జరిగిందని నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. కొత్తకోటలో బీడీ కార్మికులకు బ్రహ్మంగారి గుడి దగ్గర ప్రభుత్వ స్థలాలలో పట్టాలు ఇవ్వడం జరిగిందని పేరుకు మాత్రమే పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారని భూమి చదును చేసి బీడీ కార్మికులకు ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి కొత్తకోట అభివృద్ధి కొరకు పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం నాలుగు రోడ్ల విస్తరణ పూర్తిస్థాయిలో జరగకపోవడం ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జి మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే కొత్తకోట మున్సిపల్ షాపు కిరాయిలను అద్దె తగ్గిస్తామని హామీ ఇచ్చారు కానీ ఒక రూపాయి కూడా తగ్గించిన పాపాన పోలేదని చెప్పారు. కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్టాండు ను అభివృద్ధిపరిచి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కొత్తకోటకు ముఖ్యమంత్రి రాక సందర్భంగా మున్సిపల్ కార్మికులు 18 గంటల పాటు పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చట్టం ప్రకారంగా నెలకు 26 వేల రూపాయలు వేతనము నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.




# గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు మేళా నిర్వహిస్తున్న మైత్రి ఇండేన్ గ్యాస్

**వినియోగదారులకు ప్రత్యేక అవకాశంను**

**అవసరమైన పత్రాలతో వచ్చి సేవలు పొందాలని**

**మేనేజర్ జె. సిద్ధార్థ్ సూచన**




**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 15:** భైంసా పట్టణంలోని మైత్రి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ మేనేజర్ జె. సిద్ధార్థ్ తెలిపారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణించిన తర్వాత గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు చేయించుకోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్యాస్ కనెక్షన్ పేరును మార్చించుకునేందుకు మరణ ధృవీకరణ పత్రం, ఒరిజినల్ గ్యాస్ పేపర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే పేరు మార్పు చేయించుకునే వ్యక్తి ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా వివరాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్ వివరాలను సకాలంలో సరిచేసుకోవడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని మేనేజర్ జె. సిద్ధార్థ్ తెలిపారు. ఈ ప్రత్యేక మేళాను వినియోగదారులు సద్వినియోగం చేసుకొని అవసరమైన పత్రాలతో గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శాఖాంబరి ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని...



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి:** శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శాఖాంబరి ఉత్సవాల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ నీలిమ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని, అధికారికంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

ఆలయ ప్రధాన అర్చకులు, పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఆలయ మర్యాదలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాగణపతి, శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు, శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అధికారిక జ్యోతి ప్రజ్వలనతో శాఖాంబరి ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ పవిత్ర సంప్రదాయంలో ఈ ఏడాది శాఖాంబరి ఉత్సవాలను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ, అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి కరువు తొలగిపోవాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సునీత,ఆలయ ప్రధాన అర్చకులు శేషు నాయకులు పాలడుగుల ఆంజనేయులు,పూర్ణ పాల్గొన్నారు..

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
గురువారం | 16| జూలై| 2026

## విద్యార్థుల వీసా, విదేశీ విద్య సమస్యలపై బ్రిటిష్ ప్రతినిధితో ఎమ్మెల్యే భేటీ



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 15:** ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థుల వీసా, విదేశీ విద్యకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధి నళిని రఘు రామన్‌తో బుధవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం.1లో ఉన్న తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న వీసా సమస్యలు, ఇతర ఇబ్బందులు, వాటి పరిష్కార మార్గాలు, భవిష్యత్తులో విద్యార్థుల కు మరింత సహకారం అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సమావేశంలో గంధం నాగే శ్వర్ రావు, జెట్టా కిషోర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు నెమలి అప్పగింత



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండల కనిమెట్ట గ్రామంలో వడ్డేటి రాజు అనే రైతు పొ లం దగ్గర నెమలి ఆరోగ్యం బాగాలేక నిలబడిపోతే నెమ్మలిని గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ కి సమాచారం అందించి వారి ద్వారా వనపర్తి ఫారెస్ట్ ఆఫీసర్ నరసింహులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పారెస్ట్ అధికారులకు నెమలిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచందర్ యాదవ్, ఉప సర్పంచ్ జయరాములు, మాజీ సర్పంచ్ పరమేష్, వార్డ్ మెంబర్ కురుమూర్తి, నాయకులు హరికృష్ణ, దేవన్న, పరశురాం, కావాలి రమేష్, కొల్లంపల్లి, దొడ్ల బాలస్వామి, జనసేన, రాములు గౌడ్, బర్మల రవి తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** పట్టణ కేంద్రంలో గల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం ఉచిత నేత్ర పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శరత్ మాక్స్ విజన్ సంస్థ పలువురికి పరీక్షలు నిర్వహించింది.శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఖమ్మం తీసుకుని వెళతామని శరత్ మాక్స్ విజన్ సిబ్బంది విక్రమ్ సింగ్,అనిల్,కరుణ,లెనిన్ తెలిపారు. ఈ శిబరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఏ.యస్.ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బూరుగు దాసు,యోగానందం,నర్సయ్య పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఆధునిక సమాజానికి అనుగుణంగా తమను తాము నవీకరించుకోవాలి

### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల అక్షితబ్యూరో:** ఉపాధ్యాయులు ఇప్పుడు వస్తున్న నూతన పోకడలను అందిపుచ్చు కొని ఆధునిక సమాజానికి అనుగుణంగా తమను తాము నవీకరించుకోవాలి అని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఈ రోజు స్థానిక ఓల్డ్ హైస్కూల్లో గత మూడు రోజులుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కృత్రిమ మేధను ఉపయోగించేలా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రతి వారు వారి వృత్తిలో వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారని, ఉపాధ్యా యులు కూడా మెరుగు పరుచుకుంటేనే బోధన సులువుతుందని వారన్నారు, దానికి వారి వైద్య వృత్తిని ఉదాహరణగా చెప్పారు తమను తాము నిరంతరం నైపుణ్యాలను పెంచుకుంటేనే వైద్య రంగంలో రానిస్తామని అలాగే ఉపాధ్యాయులు కూడా నిరంతరం ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా బోధన మెలకువలను మెరుపరచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి విద్యను అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.





ఓటమికి నిరాశపడకుండా ఉండేలా విద్యార్థులలో ఉపాధ్యాయులు ఆత్మ స్థైర్యాన్ని నింపాలని, తాను పదవ తరగతిలో ఫెయిల్ అయినా కూడా తర్వాత కంటి డాక్టర్ ను కాగలిగానని తెలిపారు.

గత ఎస్ఎస్సి ఫలితాలలో జిల్లా నాలుగవ స్థానం రావడం మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, మండల విద్యాధికారి చంద్రకళ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు, రిసోర్సెస్ పర్సన్స్ పరమేశ్వర్, జగదీశ్వర్ రాజకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## బిసి మహిళపై అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

### అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** యాదగిరిగుట్ట దేవాలయ బోర్డు మెంబర్ అయిన బిసి యాదవ మహిళ ను అకారణంగా దూషించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలనీ అఖిలపక్ష ఐక్యవేదిక, కుల.. ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో అఖిలపక్ష ఐక్యవేదిక, కుల, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ సతీష్ యాదవ్, కుల ప్రజా సంఘాల నేతలు గంధం నాగరాజు లు మాట్లాడుతూ జనాభాలో 80 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలకు చిన్న పదవులు వచ్చినా కూడా కొందరు అగ్రవర్ణ నేతలు ఆకలింపు చేసుకోలేక మదమెక్కిన ఆంబోతు వలె విర్రవీగుతూ మహిళ అని కూడా చూడకుండా యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు మెంబర్ అయిన పేద మహిళను అకారణంగా దూషిస్తూ తమ నీచ బుద్ధిని బయట పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన శివ చరణ్ రెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ, అతన్ని పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేస్తున్నామని, ఒక తెలంగాణ యూ ట్యూబర్ పవన్ కళ్యాణ్ ను దూషించాడని ఎన్నో కేసులు పెట్టి పక్క రాష్ట్రానికి తీసుకెళ్లారని మరి ఇక్కడ బోర్డు మెంబర్ మహిళ ని దూషించిన శివ చరణ్ రెడ్డికి తగిన శిక్ష వేయాలని ముక్తకంఠంతో కోరారు. ఇంకోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తెలంగాణలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలంతా ఏకమై తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు సుబ్బయ్య యాదవ్, అవుల శ్రీను, 22వ వార్డ్ కౌన్సిలర్ భర్త మెకానిక్ శ్రీను, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, పానుగంటి నాగన్న, సురేష్ యాదవ్, మంగ దొడ్డి రాములు, శ్రీధర్ గౌడ్, కేశవ్ నాయక్, తిరుపతయ్య, నిరంజన్ గౌడ్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమ పథకం పేద రైతు కుటుంబాలకు ఎంతో భరోసా

### మరణించిన రైతు కుటుంబానికి ఐదు లక్షల బీమ చెక్కు పంపిణీ



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామానికి చెందిన కేతావత్ శంకర్ నాయక్ తండ్రి కేతావత్ సేవ్యా నాయక్ వయస్సు 47 సంవత్సరాలు గల రైతుకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరు అయిన ఐదు లక్షల రూపాయల రైతు బీమ చెక్కును గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్ ఉప సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్ మరేడుమాన్ దిన్నె గ్రామ సర్పంచ్ లాలి బాలు నాయక్ మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి గౌడ్ లు వారి భార్య కేతావత్ మంగమ్మ కుమారుడు కేతావత్ నరేష్ నాయక్ లకు చెక్కు అందజేశారు. రైతు శంకర్ నాయక్ జూన్ 13న తేదీన తన వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురై మరణించాడు.రాష్ట్ర ప్రభుత్వము రైతు బీమా పథకంలో మండల వ్యవసాయ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవటంతో ఈ ఐదు లక్షల రూపాయల చెక్కు రావడం జరిగింది.ఈ ఐదు లక్షల రూపాయలతో ఇలాంటి పేద రైతు కుటుంబాలకు ఎంతో భరోసా ఇస్తుందని వారు ప్రభుత్వానికి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వార్డు మెంబరులు మూడావత్ శంకరమ్మ హన్మంతు నాయక్ జరుపుల బుట్టి తారు నాయక్ నాయకులు కేతావత్ గేమ్యా నాయక్ కేళావత్ తిరుపతయ్య కేతావత్ భాస్కర్ నాయక్ మూడావత్ బాలు నాయక్ కేతావత్ వేణుగోపాల్ నాయక్ కెలావత్ లక్ష్మన్ నాయక్ కేతావత్ రాజు నాయక్ సోమాని నాయక్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

# సర్‌ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే

**మీ ఓటును కాపాడుకోండి**

**సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు**

**ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం**

**కరీంనగర్‌లో ఎన్యుమరేషన్ దరఖాస్తును నింపిన బండి సంజయ్**

**బీఎల్‌ఓ వద్దకు వెళ్లి ఫారమ్ ను అందజేసిన కేంద్ర మంత్రి**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ"సర్" ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజఝప్తి చేశారు. "సర్ ను లైట్ తీసుకుంటే మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది"అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. 'మీ ఓటును కాపాడుకోండి మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి" అని పిలుపునిచ్చారు.బుధవారం కరీంనగర్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ "సర్" ఫాంను నింపి చైతన్యపురిలోని సాధన స్కూల్ లో ఉన్న బీఎల్ వో అధికారుల వద్దకు వెళ్లి సమర్పించారు. అక్కడే ఆన్ లైన్లోనూ ఆ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది"' ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందరికీ పంపిణీ చేశారా" ఎంత మంది ఎన్యుమరేషన్ దరఖాస్తులను నింపి అందజేశారు ఈ విషయంలో ఓటర్లు పడుతున్న ఇబ్బందులేమిటి" అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 24లోపు ఎన్యుమరేషన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం మంది ఓటర్లు మాత్రమే ఎన్యుమరేషన్ ఫాంలను అందజేశారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్ర ప్రజలంతా సర్ ప్రక్రియలో పాల్గొనాలి. ఈనెల 24 వరకు సమయం ఉందని నిర్లక్ష్యం చేయకండి! చివరి రోజు కోసం ఎదురుచూడకండి. ఈ రోజే ఎన్యుమరేషన్ ఫారమ్ నింపండి మీ ఓటును కాపాడుకోండి. అట్లాగాకుండా 'నా దగ్గర ఓటర్ ఐడీ ఉంది నాకు ఏమవుతుందిలే" అని ఇంట్లో కూర్చుంటే రేపు ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌కు వెళ్లిన తర్వాత "లిస్టులో మీ పేరు గల్లంతవుతుంది. అందుకే చేతిలో ఓటర్ ఐడీ ఉంటే సరిపోదు ఓటరు జాబితాలో పేరు ఉండాలి. అందులో భాగంగా బీఎల్‌ఓ మీ ఇంటికి వస్తే సహకరించండి. సర్ ఫారమ్ తీసుకోండి. వివరాలు సరిచూసుకోండి. ఫారమ్ నింపి గడువులోగా అందించండి.ముఖ్యంగా తెలంగాణ యువతను కోరుతున్నా మీ ఫోన్‌లో గంటల తరబడి సోషల్ మీడియా చూస్తారు. రాజకీయాలపై పోస్టులు పెడతారు. ప్రభుత్వాలను తిడతారు. నాయకులను ప్రశ్నిస్తారు. కానీ మీ ఓటు లిస్టులో ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా" ఓటే లేకపోతే మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? మీ ఇంట్లో అమ్మ ఓటు చూడండి. నాన్న ఓటు చూడండి. కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయో లేదో చూడండి.ఎందుకంటే ఓటు అంటే కాగితం ముక్క కాదు. ఓటు అంటే ప్రజల చేతిలో ఉన్న అధికారం. ఓటు అంటే ప్రశ్నించే హక్కుకు బలం. ఐదేళ్లు నాయకులు ప్రజల దగ్గరకు రాకపోయినా, ఎన్నికల రోజు మాత్రం ప్రజల దగ్గరకు రావాల్సిందే. ఎందుకు" మీ చేతిలో ఓటు ఉంది కాబట్టి. అలాంటి ఓటును నిర్లక్ష్యంతో పోగొట్టుకుంటారా" ఆలోచించాలని కోరుతున్నా. ఎవరో చూస్తారులే బి ఎల్ ఓ చూసుకుంటారులే పార్టీ వాళ్లు చూసుకుంటారులే. అని వదిలేయొద్దు! మీ ఓటు బాధ్యత మీదే! ముఖ్యంగా ప్రతి యువకుడు "నా కుటుంబంలో ఒక్క ఓటు కూడా పోనివ్వను" అని సంకల్పంతో చేయాలి.

సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం. ఈ రోజు సర్ ఫారమ్‌ను నిర్లక్ష్యం చేస్తే రేపు పోలింగ్ బూత్ దగ్గర పశ్చాత్తాపపడే పరిస్థితి రావచ్చు! మీ ఓటును కాపాడుకోండి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి. ముఖ్యంగా కొన్ని చోట్ల సర్ పేరుతో హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ హిందువుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోంది. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదముంది. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉంది.ఈ రోజు ఎన్యుమరేషన్ ఫారమ్ నింపడానికి పది నిమిషాలు కేటాయించకపోతే రేపు ఎన్నికల రోజు "నా ఓటు ఎక్కడ" అని బాధపడాల్సి వస్తుంది. అప్పుడు అధికారులను నిందించినా, వ్యవస్థను ప్రశ్నించినా కాలం వెనక్కి రాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీ ఓటు పోతే మీ గొంతు బలహీనపడుతుంది. మీ ఓటు ఉంటే మీ ప్రశ్నకు బలం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నాయకుడి కంటే గొప్పవాడు ఓటర్. ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్. రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్మించేది ఓటర్. అలాంటి అమూల్యమైన ఓటు హక్కును నిర్లక్ష్యంతో కోల్పోవద్దు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం...

**మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక రక్షణ**

**ప్రతి పోలీస్ స్టేషన్‌లో 'పోలీస్ అక్క' నియామకం**

**మీ సొంత అక్క లాగా మీ సమస్యలు విని మీ రక్షణ కోసం పని చేస్తారు. సీఐ డి.నాగేశ్వరరావు**



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా మహిళలు, విద్యార్థినుల భద్రతే ధ్యేయంగా తిరుమలగిరి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'పోలీస్ అక్క' అవగాహన సదస్సు నిర్వహించారు. నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రత కోసం జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు 'పోలీస్ అక్క' అనే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళా పోలీస్ అధికారిని 'పోలీస్ అక్క'గా నియమించడం జరిగిందని వివరించారు. ఈ 'పోలీస్ అక్క' తన పరిధిలోని ప్రతి పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థినులతో సమయాన్ని కేటాయిస్తారని చెప్పారు. మీ సొంత అక్క లాగా మీతో కలిసిపోయి, మీ సమస్యలను ఓపిగ్గా విని, మీ రక్షణ కోసం నిరంతరం పనిచేస్తారని భరోసా ఇచ్చారు. "పోలీస్ అక్క ఎల్లప్పుడూ మీకోసం ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ఆపద లేదా అత్యవసర సమయాల్లో బాలికలు భయపడకుండా తక్షణ సహాయం కోసం 112 మరియు 100 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న మొబైల్ యాప్‌లను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని అవగాహన కల్పించారు. విద్యాలయంలో పోలీస్ అక్క కమిటీలు ఏర్పాటు చేస్తాం అని అన్నారు. మహిళలను ఎవరైనా వేదిస్తే కఠిన చర్యలు తప్పవు అని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్ రెడ్డి, పోలీస్ అక్క కానిస్టేబుల్ మౌనిక, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులను ప్రారంభించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోయ నరసింహ పులిజాల విష్ణు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ఆ ఇండ్ల నిర్మాణంలో భాగంగానే బుధవారం నాడు కల్వకోలు పార్వతమ్మ ఇంటి స్లాబ్ కి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పూజా కార్యక్రమం నిర్వహించి స్లాబ్ పనులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోయ నరసింహ పుల్జాల విష్ణు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి,యం అశోక్, వద్దె రాజు,ఆర్తబ్ ,మేస్త్రి బాలస్వామి ,వేణు , జగదీష్ ,తదితరులు పాల్గొన్నారు.

## జై భారత్ నాయకుడు రమణమూర్తిపై జరిగిన భౌతిక దాడి ఖండన

**సామజీక కార్యకర్త డా. పీటర్ నాయక్ లకావత్**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** జై భారత్ నాయకుడు రమణ మూర్తి పై దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డా. పీటర్ నాయక్ లకావత్ డిమాండ్ చేశారు. నిన్న ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులను ప్రజాస్వామ్యం ఎప్పటికీ సహించదన్నారు.

టెలివిజన్ ప్రత్యక్ష చర్చా కార్యక్రమంలో జైభారత్ నాయకుడు రమణమూర్తి పై జరిగిన భౌతిక దాడిని నేను అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలను హింసతో కాకుండా చర్చ వాదన రాజ్యాంగ బద్ధమైన మార్గాల ద్వారా వ్యక్తపరచాలి. భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమైన చర్య అని అన్నారు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా కల్పించింది. ఒకరి అభిప్రాయంతో విభేదించినంత మాత్రాన వారిపై దాడి చేసే హక్కు ఎవరికీ లేదు. ప్రజాస్వామ్యంలో వాదనకు ప్రత్యామ్నాయం హింస కాదు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఎన్నటికీ సమర్థనీయం కాదని పేర్కొన్నారు.ఈ ఘటనలో



దాడికి పాల్పడిన వ్యక్తిపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డా. పీటర్ నాయక్ లకావత్ డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని ఎవరూ చట్టానికి అతీతులు కారని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య దేశంలో భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డా. పీటర్ నాయక్ లకావత్ పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలను హింసతో కాకుండా పరస్పర గౌరవం సంభాషణ రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# తిరుమలగిరి చేనేత సహకార సంఘం నూతన సభ్యులకు ఘన సన్మానం

## చేనేత కార్మికుల హక్కుల సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలి

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు



**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి:** తిరుమలగిరి పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో, నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం సభ్యులను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు విచ్చేశారు.ఈ సందర్భంగా తన్నీరు రాంప్రభు మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘం ఓటర్లు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా, నిజాయితీ మరియు జవాబుదారితనంతో సంఘం అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. పదవులను బాధ్యతగా భావించి, చేనేత కార్మికుల హక్కుల కోసం, వారి సమస్యల సాధనకై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.చేనేత కార్మికుల్లో రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, అటువంటి వారిని గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికునికి అందేలా చూడాలని కోరారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సహకార సంఘం ప్రయోజనాలకే ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి బ్రహ్మం, ఉపాధ్యక్షులు ఏలే అంజయ్య, ప్రధాన కార్యదర్శి చింతకింది సోమనారాయణ, కోశాధికారి ఏలే మల్లయ్య పాల్గొన్నారు. అలాగే డైరెక్టర్లు ఏలే శ్రీను, మద్దూరి శేషగిరి, చింతకింది యాదగిరి, తుమ్మ కళావతి, మద్దూరి విజయ, మరియు ప్రముఖ నాయకులు కడారి బిక్షం, కొత్తగట్టు మల్లయ్య, పూలిమామిడి సోమయ్య, చింతకింది మురళి, అంబాటి మహేష్ గౌడ్, డాక్టర్ రామచంద్రన్ గౌడ్, దుస్సా రామ్మూర్తి, పోరెళ్ళ లక్ష్మయ్య, సోమనరసయ్య, తల్లోజు శ్రీనివాస చారి, నాగాచారి, చింతకింది నరసింహస్వామి, మద్దూరి వెంకన్న, మద్దూరి గోవర్ధన్, ముద్దంగుల యాదగిరి, రమేష్, సోమకృష్ణ, అంబరీష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో భాగంగా 22వ డివిజన్‌లో ఉచిత మొక్కల పంపిణీ

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** వనమహోత్సవం సందర్భంగా కరీంనగర్ నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణా రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన డివిజన్ ప్రజలకు ఉచిత మొక్కలను పంపిణీ చేశారు.అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

## చౌటుప్పల్‌లో ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా

## కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు...

## వలిగొండ జాతీయ రహదారి పనులు తీవ్ర జాప్యం...

## కాల్వ భూములో అక్రమ నిర్మాణాలు చర్యలు తీసుకోవాలి...

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి , మునుగోడు నియోజకవర్గ నాయకులతో కలిసి బుధవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేశారు.

**వలిగొండ జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం..**

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వలిగొండ జాతీయ రహదారి నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చి, పనులు వేగంగా జరిగేలా కృషి



చేశానని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి కారణంగా రహదారి పనులు తీవ్ర జాప్యానికి గురయ్యాయని విమర్శించారు. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

**మూడు వెంట్లు కాదు - ఆరు వెంట్లతో కల్వర్టు నిర్మించాలి...**

వలిగొండ రోడ్డులో కాలువపై నిర్మిస్తున్న కల్వర్టులో కేవలం మూడు వెంట్లు మాత్రమే ఏర్పాటు చేయడం ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాలు లేదా వరదల సమయంలో కాలువ నీరు సరిగా వెళ్లక వెనుక ఉన్న కాలనీలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మూడు వెంట్ల స్థానంలో కనీసం ఆరు వెంట్లు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించాలని సంబంధిత డీఈలు, అధికారులకు సూచించినట్లు తెలిపారు.

**కాలువ భూమిలో అక్రమ నిర్మాణాలు -- వెంటనే చర్యలు తీసుకోవాలి...**

కాలువకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ ఒక పుర కౌన్సిలర్ 200 గజాలకు మాత్రమే అనుమతి తీసుకుని, దాదాపు 500 గజాల్లో భారీ అక్రమ భవనం నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో ప్రజలను తప్పుదోవ పట్టించే పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రజా ప్రతినిధులే ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రజల్ని ఎలా రక్షిస్తారని ప్రశ్నించారు.

ఈ అక్రమ నిర్మాణంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిళ్ల కారణంగానే అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం లభిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు అక్రమ కట్టడాలు, భూ దోపిడీలు, అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు.

**బ్రిడ్జి నిర్మాణంలో ట్రాఫిక్ సమస్యలు -- ప్రమాదాల ముప్పు...**

చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనుల కారణంగా ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం కలుగుతోందన్నారు. సర్వీస్ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు డ్రైనేజీ పిల్లర్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో కొన్ని చోట్ల పిల్లర్లు కుంగిపోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రధాన అనుచరులు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తూ అక్రమ వసూళ్లు, అవినీతికి పాల్పడుతున్నారని, అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఇటువంటి చర్యల వల్ల చౌటుప్పల్ అభివృద్ధి దెబ్బతింటోందని, వెంటనే సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను ఆకస్మికంగా

# సందర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్

**జగిత్యాల అక్షితబ్యూరో:** ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ జనరల్ మీటింగ్ తదనంతరం బీసీ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల సందర్శించి, అందులోని వంటశాల మరియు స్టోర్ రూమ్ లను పరిశీలించారు.

విద్యార్థుల భోజన సదుపాయాల నాణ్యత గురించి అడిగి తెలుసుకుని, ప్రతి రోజు అందజేసే బూస్టర్ మేనును పరిశీలించి వాటి నాణ్యత మరియు కేటాయింపు గురించి చర్చించడం జరిగింది, అనంతరం విద్యార్థుల తో పాటు పంక్తిలో కూర్చుని భోజనం చేశారు. అలాగే విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నాణ్యమైన భోజనాన్ని అందించాలని, కళాశాల ప్రిన్సిపాల్ మరియు సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశించడం జరిగింది. అలాగే మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా



వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు... మరియు కళాశాల భవనం గురించి కూడా అధికారులతో చర్చించడం జరిగింది.. విద్యార్థుల ఆరోగ్యంపై కూడా సంబంధిత కళాశాల హెల్త్ సూపర్ వైజర్ తో మాట్లాడి, ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవసిందిగా సూచించారు.

విద్యార్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి 40% డైట్ చార్జెస్ పెంచడం జరిగింది. అలాగే రాష్ట్రంలోని స్కూల్ పిల్లలు మరియు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకాన్ని కల్పించినందుకు గాను విద్యార్థుల తరపున రాష్ట్రముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.

దీనికిగాను విద్యార్థులు సంతోషంతో ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు... ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి-శ్రీనివాస్, కౌన్సిలర్ సాయి కిరణ్, కో ఆప్షన్ మెంబర్స్ మరియు కౌన్సిలర్లు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జయరాజ్, మరియు కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది మరియు నాయకులు పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థ బలోపేతం సర్కార్ లక్ష్యం

## సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో కవ్వంపల్లి

**మానకొండూర్ అక్షిత న్యూస్:** రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.

బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు ఒకే చోట రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం భవనంలోని కార్యాలయ గదులను పరిశీలించి,







అధికారులు రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులతోపాటు సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్వాన్నంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట ఖజానా ఖాళీ అయ్యిందని, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటకీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండ నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల తనిఖీ

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంట గది శుభ్రత, వంటల్లో శుచి గురించి వంటవాళ్లను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగు సూచనలు చేశారు.

### సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఆయన ముత్తన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయా సీసీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

### పరామర్శ

బెజ్జంకి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగిటి రాజయ్య కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్య నారాయణ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం

## మండల అధ్యక్షుడు నూనె అనిల్



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పల్లె కుమార్ మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జాతీయ అధ్యక్షుడు నితీన్ నభీన్ ఇటీవల తెలంగాణలో మూడు రోజుల పాటు విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి మార్గనిర్దేశం చేశారని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల సుపరిపాలనతో పాటు పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల్లో బీజేపీపై విశ్వాసం పెంపొందించి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీ శ్రేణులు చురుకుగా పాల్గొని, ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేయడంలో ప్రజలకు సహకరించాలని, బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అర్హుడికి ఓటు హక్కు లభించేలా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు గడ్డం నరేందర్, మండల ప్రధాన కార్యదర్శులు మందపురి రాజు, నిమ్మల అనిల్, మండల ఉపాధ్యక్షుడు ఘటికల్లు ఉపసర్పంచ్ చిరు నాగరాజు, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్, మండల కార్యదర్శి మందపురి రాజశేఖర్, మండల నాయకులు మెరుగు శ్రీను, సోడియ సురేష్ నాయక్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మంచాల సుమన్ యాదవ్, యువ మోర్చా నాయకులు జక్కుల సందీప్ యాదవ్, సిద్ధు, రాకేష్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా కూరగాయల విత్తన కిట్ల పంపిణీ

## ముధోల్ మండల గ్రామపంచాయతీలో కార్యక్రమంను ఇంటి వద్దే పోషకాహార తోటలు పెంచాలని అధికారుల సూచన



**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 15:** ముధోల్ మండల గ్రామపంచాయతీలో బుధవారం ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తన కిట్లను పంపిణీ చేశారు. రైతులు ఇంటి పరిసరాల్లో కూరగాయల సాగు చేపట్టి పోషకాహార భద్రతతో పాటు అదనపు ఆదాయం పొందాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి జావిద్ పాషా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విత్తన కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రతి రైతు ఇంటి వద్ద పోషకాహార తోటలను అభివృద్ధి చేయాలని కోరారు. ఉద్యాన విస్తరణ అధికారి మొయిన్ మియా రైతులకు విత్తనాల సాగు విధానం, సంరక్షణ, దిగుబడి పెంపుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇజాజ్ ఖాన్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు, ఆత్మ డైరెక్టర్ కిషన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అర్హులైన రైతులకు కూరగాయల విత్తన కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

# ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి..టీజీవీపీ డిమాండ్



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు వెంటనే మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర కోఆర్డినేటర్ హరీష్ డిమాండ్ చేశారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించాల్సిన హాస్టళ్లు కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడు తున్నాయని విమర్శించారు. హాస్టళ్లలో తక్షణమే కింది సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**పోషకాహారం:** విద్యార్థులకు నిత్యం నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి.

**తాగునీరు:** కలుషిత నీటి వల్ల విద్యార్థులు రోగాల బారిన పడకుండా, పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం కల్పించాలి.

**పరిశుభ్రత:** మరుగుదొడ్లు, స్నానాల గదులను ప్రతిరోజూ శుభ్రంగా నిర్వహించాలి.

**కరెంట్ సరఫరా:** విద్యార్థుల చదువులకు అంతరాయం కలగకుండా 24 గంటల విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**గది సదుపాయాలు:** హాస్టళ్లలో సరిపడా పడకలు, పరుపులు, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉంచాలి.

**భవనాల మరమ్మతులు:** శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

**భద్రత:** విద్యార్థుల రక్షణ కోసం హాస్టల్ ఆవరణలో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలి. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని హరీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు ఉదయ్, చరన్, నగేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక
గురువారం | 16| జూలై| 2026

# అక్షిత జాతీయ తెలుగు దినపత్రిక కథనానికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం

### ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### త్వరలో తన సేవలు అందుబాటులోకి తేనున్న నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత స్కూల్

**వరంగల్, అక్షిత బ్యూరో:** గత కొంతకాలంగా దేశాయిపేట ప్రభుత్వ పాఠశాల శిదిలవస్థకు చేరడం తో విద్యార్థులు ప్రాణ భయంతో మీకు బుక్కు మంటూ కాలం గడుపుతున్న నేపథ్యంలో. గత సంవత్సరం నెహ్రూ మెమోరియల్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు లేక కాయిల పడింది. ఈ





దేశాయిపేట నెహ్రూ మెమోరియల్
ఎయిడెడ్ స్కూల్‌ను కాపాడండి
14 Jun 2026 - Page 8

తరుణంలో పాఠశాల ప్రైవేట్ వ్యక్తుల పరం కాను న్నదని వివాదాలు రేకెత్తినాయి. కొంతమంది దీనిపై కన్నేసిన నేపథ్యంలో స్థానికుల సహకారంతో పూర్వ విద్యార్థులు ఏకమై పాఠశాలను రక్షించేందుకు జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వాన్ని గత ఏడాదికాలంగా కోరుతున్న నేపథ్యంలో గత నెల రోజుల క్రితం జిల్లా యంత్రాంగం విద్యాశాఖ అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్పందించి దేశాయిపేట ప్రభుత్వ పాఠశాలను పునర్నిర్మాణం చేపట్టే వరకు నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో కొనసాగించాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి సికేఎం కళాశాలలో ప్రభుత్వ పాఠశాల కొనసాగుతుంది. చాలా రోజులుగా నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ మూతపడడంతో తరగతి గదులు శిథిలావస్థకు చేరగా జిల్లా యంత్రాంగం వాటి మరమ్మతులు చేయిస్తుంది చెట్లు మూలకంపలు భయానక పరిస్థితులు తలపించగా వాటిని సేవలకు సిద్ధం చేసి విద్యాబోధనకు సిద్ధం చేస్తున్నారు జిల్లా అధికారులు.

ఈ సందర్భంగా దీనిపై ప్రత్యేక కథనాలు ప్రచురించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన అక్షిత జాతీయ తెలుగు దినపత్రికకు స్థానికులు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీతో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు ప్రభుత్వ జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న నిష్పక్షపాత జర్నలిజానికి ప్రజలు నీరాజనాల పలుకుతున్నారు.

# ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** ఆపదలో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 57 వేల, వేములవాడ అర్బన్ మండల పరిధికి చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల 66 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందించడం వల్ల వారికి ఆర్థిక భారం తగ్గుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వంగ పర్శరాములు గౌడ్, పిల్లి కనకయ్య లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించిన సీపీ



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూంను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కంట్రోల్ రూం సిబ్బంది పనితీరు, అత్యవసర కాల్స్ స్వీకరణ విధానం, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, నగరంలోని వివిధ ప్రాంతాలపై నిఘా, సాంకేతిక వ్యవస్థల పనితీరును కమిషనర్ సమీక్షించారు. ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగవంతంగా అందేలా కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.


అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో మరింత సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్. ఐ సతీష్, క్లూస్ ఇన్స్‌స్పెక్టర్ రాజ్ కుమార్, ఎస్. ఐ రోహిత్, ఆర్. ఎస్. ఐ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం!

### చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి

### యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ మాట్లాడుతూ తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో ఎక్మో ( కృత్రిమ గుండె – ఊపిరితిత్తుల పరికరం ) విధానం ఒక సంజీవనిలా మారుతోందని తెలిపారు. ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను మరియు మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులో కి వచ్చాయో వివరించడానికి చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రాణం నిలిపే ఎక్మో (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం చివరి దశ ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ వెనో – వీనస్ ఎక్మో లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని అన్నారు ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు. సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ పరమేష్ అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించిన మండల విద్యాధికారి ఇమ్మానియేల్




**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల చుక్కాయిపల్లి లో మంజూరైన ప్రీ ప్రైమరీ తరగతులను బుధవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కొల్లాపూర్ మండలం విద్యాధికారి శ్రీ ఇమ్మానియేల్ హాజరై రిబ్బన్ కట్ చేసి తరగతులను ప్రారంభించరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన ఏకైక పాఠశాల మన ప్రాథమిక పాఠశాల చుక్కాయి పల్లి. పాఠశాల యందు విద్యా సంవత్సరం లో నుండి నర్సరీ ఎల్కేజీ యూకేజీ తరగతులు నూతనంగా ప్రారంభం కావడంతో పాటు వారి బోధనకు కొత్తగా ఒక టీచర్, సేవ చేయడానికి ఒక ఆయా నియామకం కావడం జరిగిందని వారు మంచి బోధన అందించి ఇంగ్లీష్ మీడియంలోనే నాణ్యమైన విద్యను అందించాలని కోరరు. విద్యార్థులందరూ పాఠశాలకు రెగ్యులర్గా విచ్చేసి ఆడుతూ పాడుతూ చక్కగా చదువుకోవాలని మీకు విద్యాబోధన చేయడానికి కొత్తగా ఒక టీచర్ (ఇన్ స్ట్రక్చర్) లక్ష్మి, ఆయాగా మాధవి సెలెక్ట్ కావడం జరిగిందని వారు మంచి బోధన అందిస్తారని మీతో పాటు మరికొంతమంది విద్యార్థులను బడికి వచ్చేటట్లు చేయాలని ఈ పాఠశాలలో మంచి నాణ్యమైన విద్యా బోధన జరగాలని తద్వారా వచ్చే సంవత్సరం నాటికి రెట్టింపు విద్యార్థుల నమోదు జరగాలని కోరరు. చిన్నపిల్లలు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని టీచర్లకు సూచించరు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, డి సత్యమ్మ, కే బాలాజి, లక్ష్మి, మాధవి,రేణుక పాల్గొన్నారు.